నకిలీపై నిగ్గు తేల్చాలి

- ప్రభుత్వ సహకారంతోనే నకిలీ మద్యం తయారీ
- సీబీఐ విచారణకు డిమాండ్
- వైఎస్సార్ సీపీ పోరుబాట



ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌కు ర్యాలీగా తరలివెళ్తున్న జిల్లా అధ్యక్షుడు రాజా, నాయకులు, కార్యకర్తలు

తుని రూరల్: రాష్ట్రంలో విచ్చలవిడిగా బయపటడుతున్న నకిలీ మద్యం, తయారీ విక్రయాలపై కేంద్ర ప్రభుత్వ సంస్థ సీబీఐ విచారణ చేపట్టాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా డిమాండ్ చేశారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు సోమవారం తుని పట్టణంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఎదుట నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఆందోళన నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీఐ పట్టాభి చౌదరికి అందజేశారు. ఈ సందర్భంగా దాడిశెట్టి రాజా విలేకర్లతో మాట్లాడుతూ..భారత దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎన్నికల ముందు చంద్రబాబునాయుడి ఆధ్వర్యంలో కూటమి నాయకులు నాణ్యమైన మద్యం తక్కువ ధరకే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమం మద్యం కేసులు పెడుతూ ప్రభుత్వం నాయకులను వేధిస్తుందన్నారు. మద్యం పాలసీని మార్చిన కూటమి ప్రభుత్వం దుకాణాలను తన అనుచరులకు అప్పగించిందని, వేలాదిగా గ్రామాల్లో బెల్టు షాపులను తెరిచి ఎన్ బ్రాండ్ కల్తీ మద్యాన్ని విక్రయిస్తుందన్నారు. కల్తీ మద్యాన్ని సేవించిన ప్రజలు మృత్యువాత పడుతున్నారన్నారు.

వంద కిలోమీటర్ల పరిధిలో ఒక ప్లాంట్

వ్యవస్థాగతంగా వంద కిలో మీటర్ల దూరంలో రెండు జిల్లాలకు ఒకటి చొప్పున నకిలీ మద్యం తయారీకి ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి అడ్డూఅదుపు లేకుండ కల్తీ మద్యం విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. నకిలీ మద్యం తాగిన వ్యక్తులు నాలుగైదు రోజులు నీరసంతో జవసత్వాలు కోల్పోతున్నారన్నారు. నకిలీ మద్యంపై రాష్ట్ర వ్యాప్తంగా వ్యతిరేకత వస్తున్నప్పటికీ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఒప్పందాలు చేసుకున్న కంపెనీలు వస్తున్నాయని, దానికి ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ కూటమి ప్రభుత్వం తప్పించుకుంటోందన్నారు. ప్రజల ప్రాణాలను హరించే నకిలీ మద్యం నిందుతులు పట్టుబడుతున్నా ఎక్కడ బెల్టు షాపుకాని మద్యం దుకాణాన్ని కాని సీజ్ చేయలేదన్నారు. నాలుగైదు రోజులుగా ప్రజల్లో చర్చ జరుగుతున్న స్పందించని చంద్రబాబు ఇప్పుడు చేతులు దులుపుకోనేందుకు సిట్, సీఐడీలతో విచారణ అంటున్నారని, వీటిపై ఎవరికి నమ్మకం లేదన్నారు.

జనసేన, బీజేపీల వైఖరి స్పష్టం చేయాలి

చంద్రబాబుకు చిత్తశుద్ధితో నిందితులను పట్టుకోవాలని ఉంటే ధైర్యంగా సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిందితుల సెల్‌ఫోన్లు పోయాయని ఎల్లో మీడియాకు లీకులు ఇస్తున్నారన్నారు. నకిలీలను గుర్తించేందుకు యాప్ ద్వారా స్కాన్ చేసుకోవాలనడం మరితం విడ్డూరంగా ఉందని, రాష్ట్రంలో యువత ఎవరు సంక్షేమ పథకాలు కోరుకోవడం లేదని ఒక నాయకుడు ట్వీట్ చేశారని, జగన్ చేసిన సంక్షేమాలు వల్ల రాష్ట్రానికి ఆదాయం వస్తుందని, ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడుతున్నాయన్నారు. విద్య, వైద్యంలో రాష్ట్రాన్ని ఒకస్థాయికి తీసుకువెళ్లిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. ఏడాదిన్నరలో వ్యవస్థను కూటమి ప్రభుత్వం సర్వనాశనం చేసిందన్నారు. వేలాది కోట్లు స్కామ్‌లు చేసిన చంద్రబాబు, లోకేష్‌లు ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుకోకుండ నాణ్యమైన మద్యం అందించాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న స్కాములు, నకిలీ మద్యంపై కూటమిలో భాగస్వామ్యులుగా ఉన్న జనసేన, బీజేపీ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సకురు నాగేంద్ర నెహ్రూ, రేలంగి రమణగౌడ్, బెక్కం చంద్రగిరి, మడద హేమంత్, గొర్లి రామచంద్రరావు, గంటా చక్రరావు, పోతల రమణ, వైఎస్సార్‌సీపీ మూడు మండలాల అధ్యక్షులు దుంగల నాగేశ్వరరావు, అన్నవరం శ్రీను, కౌన్సిలర్లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తునిలో విలేకర్లతో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలకు ఆర్థిక చేయూత


హెచ్‌ఎంకు చెక్కు అందజేస్తున్న సుంకర రాంబాబు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వైఎస్సార్ సీపీనేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సుంకర రాంబాబు ఆర్థిక సాహయం అందజేశారు. పాఠశాలలో విద్యార్థులను క్రమ శిక్షణగా ఉంచేందుకు, క్రీడాపోటీలకు మైక్ సిస్టమ్ కావాలని సిబ్బంది కోరారు. వెంటనే స్పందించిన ఆయన రూ.25వేల నగదు చెక్కును హెచ్‌ఎం లక్ష్మీతులసికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

బాధ్యతలు చేపట్టిన నూతన ఉపాధ్యాయులు

గండేపల్లి: డీఎస్సీలో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు సోమవారం బాధ్యతలు చేపట్టినట్టు ఎంఈఓ కెహెచ్ నాయక్ తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు, యల్లమిల్లి, తాళ్లూరు, మల్లేపల్లి, రామయ్యపాలెంలో ప్రభుత్వ పాఠశాలలకు గాను 14 మంది ఉపాధ్యాయులు శిక్షణ పూర్తిచేసుకుని బాధ్యతలు స్వీకరించినట్లు పేర్కొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


ప్రొఫెసర్ వీరాస్వామి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్ లభించినట్టు ప్రో ఛాన్సలర్ ఎస్.సతీష్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగంలో పనిచేస్తున్న దాసరి వీరాస్వామి హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించినట్టు తెలిపారు. వీరాస్వామి సమర్పించిన థీసిస్ శీర్షిక అనలైజింగ్ స్టూడెంట్ అడాప్ట్ బిలిటీ ఇన్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ యూజింగ్ మెషిన్ లెర్నింగ్ ఆల్గోరిథమ్స్ అనే అంశంపై ఈ డాక్టరేట్ పొందినట్టు పేర్కొన్నారు.

చిన్నజీయర్ స్వామికి ఆహ్వాన పత్రిక అందజేత

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ప్రసిద్ధ శ్రీరామగిరి క్షేత్ర ప్రాంగణంలో నూతనంగా నిర్మితమవుతున్న పుష్కరిణి పనులు చివరి దశకు చేరుకున్నాయి. నవంబర్ రెండోవ తేదీన పుష్కరిణి ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైనట్టు ఆలయ అర్చకులు తెలిపారు. పుష్కరిణి ప్రారంభోత్సవానికి రామానుజ చిన్నజీయర్ స్వామిని, అహోబిల జీయర్‌స్వాములను ఆహ్వానించినట్లు శ్రీసీతారామ నామసంకీర్తన సంఘ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అభివద్ధి పనులను, శ్రీరామగిరి అభివద్ధి కొరకు ఏర్పాటు చేసిన సంఘం వివరాలను చిన్న జీయర్‌కు వివరించామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


రెడ్డిచర్ల నరసింహరాజు మృతదేహం

గోకవరం: కృష్ణుని పాలెం పంచాయతీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ సమీపాన అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్నకోరుకొండకు చెందిన రెడ్డిచర్ల నరసింహరాజు (39) భార్యతో విభేదాల కారణంగా ఏడాది కాలంగా ఆర్అండ్ఆర్ కాలనీలో నివాసం ఉంటూ హోమ్‌నీడ్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కాలనీ సమీపంలో మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై పవన్ కుమార్ సిబ్బందితో అక్కడకు చేరుకుని శవపంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

గండేపల్లి: ఓ వ్యక్తిని మోటార్ సైకిల్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గండేపల్లి పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. అనకాపల్లి జిల్లా అచ్చుతాపురానికి చెందిన గెద్దం త్రిమూర్తులు (38) సూరంపాలెంలోని ఓ కళాశాలలో ప్రైవేట్‌గా నిర్వహిస్తున్న క్యాంటీన్‌లో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడు ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో నడుచుకుంటూ రామేశంపేట సెంటర్ నుంచి కళాశాలకు వెళ్తుండగా వెనుక నుంచి మోటార్ సైక్లిస్టు వేగంగా వచ్చి త్రిమూర్తులును ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కృత్రిమ మేధస్సుపై పట్టు తప్పనిసరి


అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం: కృత్రిమ మేధస్సు (అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ఏఐపై విద్యార్థులు పట్టుసాధించాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధస్సుపై ఆరురోజుల పాటు నిర్వహించే శిక్షణ శిబిరాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మానవుని జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కృత్రిమ మేధస్సు వైద్య, విద్యా, వ్యాపారం, వ్యవసాయం ప్రతి రంగంపై తన ప్రభావాన్ని చూపుతుందన్నారు. ప్రధానమంత్రి ఉచ్ఛాతర్ శిక్షా అభియాన్‌లో భాగంగా 40 మంది విద్యార్థులను ఒకగ్రూపుగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు విజయవాడకు చెందిన ఎక్సెస్ పాయింట్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్స్ ఆర్‌వేణు, సాయికృష్ణ, అధ్యాపకులు ప్రగడ ప్రయాగమూర్తి, కెవెంకటేశ్వరరావు, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్య కళాశాలతో ప్రత్యేక అనుబంధం

సందడి చేసిన హీరో కిరణ్ అబ్బవరం


విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతున్న సినీ హీరో కిరణ్ అబ్బవరం

గండేపల్లి: కె-రాంప్ చిత్రం ప్రతి ఒక్కరికి నచ్చేవిధంగా, గత చిత్రాలవలే వైవిధ్యభరితంగా ఉంటుందని సినీ హీరో, చిత్ర కథానాయకుడు కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సోమవారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీకి విచ్చేసిన ఆయనకు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఆ ఈనెల 18న విడుదల కానున్న కె-రాంప్ చిత్రాన్ని థియేటర్లలో చూసి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఆదిత్య విద్యాసంస్థలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఆదిత్య అంటే తన సొంత సంస్థగా భావిస్తున్నానన్నారు. అనంతరం ప్రో చాన్సలర్ ఎస్.సతీష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి చిత్ర ప్రమోషన్‌కు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు హీరోతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు ఉత్సాహంగా ఎగబడ్డారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

శంఖవరం: మండల కేంద్రం శంఖవరంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) వద్ద సోమవారం యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడ్డారు. సొసైటీ పరిధిలో 15 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలోని ఐదు వందల మంది రైతులు యూరియా కోసం ఒక్కసారిగా సొసైటీ తరలివచ్చారు. సొసైటీకి కేవలం 200 బస్తాల యూరియా మాత్రమే రావడంతో ఒక్కోరైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేసినా సరిపోలేని పరిస్థితి. మిగిలిన రైతులకు యూరియా దక్కకపోవడంతో నిరాసరతో ఇంటి ముఖంపట్టారు. రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేయడంతో కూటమి ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని రైతులు విమర్శలు గుప్పించారు.

జీవన ఎరువులే మేలు

జగ్గంపేట: రైతులు పంటల సాగులో రసాయినక ఎరువులు వినియోగం తగ్గించి జీవన ఎరువులు వినియోగాన్ని పెంచాలని పంటకు ఎంతో మేలు జరుగుతుందని, పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.సీ తారామశర్మ తెలిపారు. జగ్గంపేట శివారు సీతానగరం గ్రామంలోని ఆచార్య ఎన్.జి రంగా విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం పెద్దాపురం, జగ్గంపేట వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఎరువులు వినియోగం లాభ నష్టాలపై అవగాహన కల్పించారు.

జగ్గంపేటకు పతకాల పంట


పతకాలు సాధించిన ముగ్గురు క్రీడాకారులు

జగ్గంపేట: కర్ణాటక స్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జగ్గంపేటకు చెందిన క్రీడాకారులు బంగారు, వెండి, కలిపి 7 పతకాలు సాధించి తమ సత్తా చాటారు. జగ్గంపేటకు చెందిన కోచ్ బి.కన్నారావు అందించిన వివరాల ప్రకారం ఈనెల 9వ తేది నుంచి 12వ తేది వరకూ బెంగుళూరు వైట్ ఫీల్డులో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వివిధ రాష్ట్రాలనుంచి వందలాది క్రీడాకారులు పాల్గొన్నారు. 74కేజీల కేటగిరిలో (సీనియర్స్ విభాగం) 445 కేజీలు లిఫ్ట్ చేసి జగ్గంపేటకు చెందిన బి.శివసాయి వీరబాబు గోల్డు, బ్రౌంజ్ మెడల్ సాధించారు. ఎం.యశ్విన్ 93కేజీల (సబ్ జూనియర్స్) విభాగంలో 430 కేజీలు లిఫ్ట చేసి 3 సిల్వర్ మెడల్స్ సాధించారు. ఎం.ఎమ్ రేవంత్ 66 కేజీల సబ్‌జూనియర్స్ విభాగంలో 220 కేజీలు లిఫ్ట చేసి 2 బంగారు పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు రాణించడం ఆనందంగా ఉందన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాము

తుని రూరల్: యూరియా కొరత ఎదురైనప్పటికీ మండలంలో 17వేల బస్తాలను రైతులకు సరఫరా చేశామని ఏఓ బి.అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయం, గ్రామీణ తాగునీరు, విద్య, ఉద్యాన, ఉపాధి తదితర విభాగాల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులకు కాకుండ ఆధార్ కార్డు తీసుకువచ్చిన వ్యక్తులకు యూరియా ఇచ్చారని ఆరోపించారు. దీనిపై ఏఓ మాట్లాడుతూ మొదట్లో యూరియా కొరత ఉందని, ఆధార్ కార్డుకు ఒక బస్తా చొప్పున యూరియాను అందించామన్నారు. ప్రైవేట్ డీలర్లు యూరియా అమ్మకాలు చేయలేదని, పీఏసీఎస్ సొసైటీలు, ఆర్ఎస్‌కేల్లో మాత్రమే ఆయా గ్రామాల్లో రైతులకు అందించామన్నారు. మండలానికి 326 గోకులం షెడ్లు మంజూరైయినట్టు ఏపీఓ నారాయణరావు తెలిపారు. ఇప్పటి వరకు మూడు లక్షల పని దినాలను 13,400 మంది కూలీలకు కల్పించామన్నారు. ఇందుకు రూ.ఎనిమిది కోట్లు కూలిగా చెల్లించామన్నారు. బిల్లులు చెల్లింపుల్లో జాప్యంతో కొన్ని గ్రామాల్లో జేజేఎం పథకం పైపులైన్ల విస్తరణ, ఇంటింటా కుళాయిలు ఇవ్వలేదని సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ సమాధానం ఇచ్చారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఎంపీడీఓ కె.సాయినవీన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రత్తిపాడు రూరల్: యువత ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే వరుపులు సత్యప్రభ అన్నారు. మండలంలోని ఒమ్మంగి గ్రామంలో సోమవారం సుంకర భవాని అనే మహిళ నూతనంగా ఏర్పాటు చేసుకున్న సంఘం డైరీ పాల ఉత్పత్తుల కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. యువత ఉన్నత చదువులు చదివినా కొలువుల కోసం ఎదురుచూడకుండ వినూత్న ఆలోచనలతో ఉపాధి పొందడం అభినందనీయమన్నారు.

కమ్మేసిన ముసురు


మల్లేపల్లి శివారులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

గండేపల్లి: మండలంలోని సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ప్రజలు అవస్థలపాలయ్యారు. వరి చేలు కోతకు వచ్చే సమయంలో వర్షం కురవడంతో వరి పొలాలు దెబ్బతింటాయేమోనని మండల పరిధిలోని రైతులు బెంబేలెత్తుతున్నారు. మరికొన్ని చోట్ల చేను కోసందుకు వచ్చిన వరి కోత యంత్రాలకు ఇబ్బంది ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైకి వర్షం నీరు చేరింది. దీనితో స్థానిక ప్రజలు వర్షపు నీటితో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. భారీ వర్షం కారణంగా మల్లేపల్లి, నీలాద్రిరావుపేట, తాళ్లూరు, తదితర గ్రామాల్లో సీసీ రోడ్లపైకి చేరింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు మేలుకొని డ్రైనేజీలలో పేరుకుపోయిన షీల్ట్, చెత్త, చెదారాన్ని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సీపీఆర్‌తో పునర్జన్మ


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ సౌమ్యా మైఖేల్

ప్రత్తిపాడు: ప్రతీ వ్యక్తి సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరిటెండెంట్ డాక్టర్ బి.సౌమ్యా మైఖేల్ అన్నారు. సీపీఆర్ అవగాహనా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్తిపాడు సీహెచ్‌సీలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏవ్యక్తికైనా శ్వాస ఆగిపోయినపుడు సీపీఆర్ చేస్తే తిరిగి గుండె కొట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ఈనెల 13వ తేదీ నుంచి 17 వరకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు వినయ్, సాగర్, శ్వేత, వినీల, ఎ. సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

శాలివాహన సామాజికవర్గ అభివృద్ధికి తోడ్పాటు


కుండల తయారీని పరిశీలిస్తున్న చైర్మన్ ఈశ్వర్

ప్రత్తిపాడు రూరల్: శాలివాహన సామాజికవర్గం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని రాష్ట్ర శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ పి.ఈశ్వర్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆయన మండలంలోని ధర్మవరంలో శాలివాహన ఫెడరేషన్ డైరెక్టర్ బీమాబత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామంలో కులవృత్తిదారులు చేస్తున్న పనులను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మట్టి కుండల తయారీపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న తమకు మట్టి తవ్వుకునేందుకు స్థలం కేటాయించాలని కోరారు. సంఘ నాయకులు స్వయంవరపు వెంకటరమణ, అనకాపల్లి అప్పారావు, అనకాపల్లి నాగేశ్వరావు, ఉబ్బిశెట్టి నారాయణరావు, బి అప్పారావు, తెల్లపూడి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మట్టి సమస్యను పరిష్కరించండి

ప్రత్తిపాడు రూరల్: కుమ్మరి వృత్తిదారుల మట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే సత్యప్రభకు ఏపీ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్ వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని పెదశంకర్లపూడిలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే సత్యప్రభను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి కుమ్మరి, శాలివాహన వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లంక గోపీనాథ్ ప్రారంభించారు. శిబిరంలో కాకినాడ జయంతి ఐ కేర్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, బార్ ప్రతినిధులు న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

గోకవరం: మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఇన్ సర్వీస్ కోటా పెంచాలని పీహెచ్‌సీఈ డాక్టర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా సిబ్బంది నల్లబ్యాడ్జీలతో హాజరై సంఘీభావం తెలిపారు. ఆసుపత్రిలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో సైతం వీరు బ్యాడ్జీలతో పాల్గొని తమ మద్దతును ప్రకటించారు.